# గుణపాఠము

శ్రీ చీమలపాటి సూర్యనారాయణగారు

మా యింటికి ఎడమప్రక్కన చిట్టి నివశిస్తూన్న గృహముంది; వారిమేడకిటికీ, మా మేడ కిటికీకి యెదురుగా నేయుంది. నేను నాగదిలోఁ గూర్చుని, కిటికీ వూచలద్వారా చూచినట్లయితే, వారిమేడగదిలో ఏమి జరుగుచున్నదీ, స్పష్టంగా గోచరిస్తుంది.

నేను నిత్యమూ నాగదిలో పడక కుర్చీలో పండుకొని, పత్రికలు చదువుకొనే వేళ, సోమయాజులగారి కూతురు: చిట్టి కేశ సంస్కారమూ, తదితర మయిన పనులు చేసుకొనేవేళ, ఒకటయేది. నేను పత్రికను చదువుతూండే వాడినేఁగాని, దృష్టి మాత్రం చీఁటికి మాఁటికీ చిట్టివయిపు మరలి పోయేది; ఆమె ప్రతిచర్యనూ గమనిస్తూండే వాడిని.

నిడుదలై, సొగసయిన కేశములకు తైల సంస్కారము చేసుకొని, గంటల తరఁబడి విసుఁగు చెందకుండా, తలను చక్కగా దువ్వుకుని, తలలో పువ్వులను తురుముకునేది. ఆమె కేశ సంస్కారములో తీసుకుంటూన్న శ్రద్ధ మరి యే స్త్రీ తీసుకొనదంటే మీరాశ్చర్య పోవద్దు!

ఆమె దువ్వుకొనుచు, నావయిపు మధ్య మధ్య చూస్తూన్న చూపులు నాహృదయ కరండములలో నిహితమైయున్న అవ్యక్త మధుర వాంఛలను గాఢ సుషుప్తిలో నుండి మేల్కొల్పేయి. ఆమె శరీర సౌందర్యము, యౌవనపు బిఁగువు నన్ను పిచ్చివానిగా చేసేవి. ఆమెతో మాట్లాడాలని ... స్నేహము చేయాలని .. ఏవేవో పిచ్చియూహలు నాహృదయాంతరాళములో జనించక పోలేదు. అందుకే ఆమె వయిఁపు నిత్యమూ యాశగా జూస్తూ, చిట్టిని కలుసుకొనే మధురక్షణమునకై ఎదురుఁ జూస్తున్నాను. చిట్టి నావైపుఁజూచినప్పుడెల్లా, నా శరీరము గగుర్పాటు పొందుతూ, ఏదో చెప్పరాని యానందములో తిప్పేది!

మా యావిడా, నేను ఎంతో అన్యోన్య ప్రేమానురాగములతో యుంటున్నాము; మా ఉభయులమధ్యా ఎన్నఁడూ; లావాదేవీలుఁగాని, పిలకాపిరికీలుఁగాని, తర్జన భర్జనలుఁగాని లేవనే చెప్పాలి! ఒడ్డు పొడుఁగులందైతేనేమి - అందచందములందైతేనేమి - మాటల స్వరాల్లో ఐతేనేమి, మా ఆవిడకు, చిట్టికి యిసుమంతైన బేధమయినా లేకపోయినప్పటికీ, ఛాయలో మాత్రం ఎటొచ్చీ మా 'శ్రీకాంతే' చిట్టికంటే తక్కువని చెప్పాలి.

చిట్టి - మేనిఛాయలోని యింద్రధాపపు వొంపు రంగులు, ధళ ధళమని మెరిసేవి; నడకలో కేకిని నృత్య భంగిమలు వుట్టిపడేవి; మరుద్దామన్న మరుఁపు రాకున్నాయి; ఆమె కౌగిట్లో సుఖించాలన్న కోర్కె నాకు జనించక పోలేదు.

ఆనాఁడు నాయలవాటు ప్రకారము నాగదిలోఁ గూర్చుని, పత్రికా పఠనముఁ జేస్తున్నాను. చిట్టి తన యలవాటు ప్రకారము కేశములకు తైల సంస్కారము చేసుకుంటూంది. పత్రిక చదువుతున్నానేఁగాని, దృష్టిమాత్రము ఆమె ప్రతిచర్యను గమనిస్తున్నది. మనస్సు మనస్సులో లేదనే చెప్పాలి! ఆమె వయిఁపు దీక్షగా చూడటం బాగుండదన్న కారణంచేత, అప్పుడప్పుడూ చూస్తున్నాను. ఆమె గూడా నాకుమల్లే నటిస్తూంది.

కొంతకాలము తరువాత - అప్రయత్నముగా అనుకోకుండానే మాయిరువురి చూపులూ క్షణ కాలము కలుసుకుని, మాయిరువురి హృదయములలోని బాధలను వొకరికొకరికి వ్యక్త పరచుకున్నాయ్! చిట్టి అప్రయత్నముగా నావయిపుఁజూచి నవ్వింది. ఆనవ్వు నన్ను ఆనందములో తిప్పి, తిఁగి నాభుజం మీఁది చొక్కా చిరుఁగును గమనించేంకేఁటి బొబ్బిలి మానవునిగా మార్చివేసింది.

నాకు కాల పిపాతము కాకుండా కాఫీ త్రాగటం అలవాటు! అటువంటిది యీనాఁడు కాఫీ త్రాగేందుకు కాలస్యించుటకు కారణమేమిటో తెల్సుకోవాలనే కుతూహలం మాయావిడకు జనించటం సహజమే! అందుకే నాగదిలోకివచ్చి నూయిరువురి చర్యలను కనిపెట్టింది. యీవిషయం కొంత కాలం పోయిన తరువాత తెలిపిందిలెండి!

"కాఫీ చల్లారి పోతూంది; గమ్మున రండి! పిల్చి పిల్చినాగొంతు తడారిపోయింది." అంది. ఒక్క మారు తుళ్లిపడ్డాను: గుండెలు గతుక్కుమన్నాయి. యింక మాయావిడ చేత, చీవాట్లు తప్పవనుకున్నాను... కానీ మాశ్రీకాంత యీవిషయం ఎప్పటికీ ప్రస్తావించక పోవటంచేత నాగుండెలు గూట్లోకి వచ్చేయి.

ఆవేళ నాకు సెలవు కావటంచేత, మిల్లు డ్యూటీకి వెళ్లక, తీరుబడిగా మధ్యాహ్నం నా గదిలో పడుకుని, కరెంటు 'గృహలక్ష్మి' రాక పోవటంచేత, లైబ్రరీ నుండి తెచ్చిన పాత (Previous) గృహలక్ష్ములను తిరగవేస్తున్నాను... యింతలో మాయావిడ పనిపాట్లను ముగించుకుని తమలపాకులతో నాదగ్గరకు వచ్చింది; చేరువులో కూర్చుంది. సున్నమును రాసిన తమలపాకులను అందిస్తూ.

"ఏమండీ, గృహలక్ష్మికి నేను పంపిన కథనింకా ప్రచురించలేదేమండి, ఆర్నెల్లుకావస్తూన్న!"

"అవకాశం, స్థలం దొరకాలంటావా? ప్రచురిస్తారు; ప్రచురిస్తామనట్లు కార్డు వ్రాశారాపోని"

"లేదు?" అంది, "అయితే కల్సిపోయింది." పెద్దగా నవ్వుతూ అన్నా!

"ఎందులో?" అని ప్రశ్నించింది. "విశ్వసార స్వతార్ణవంలో." అన్నా.

"పోనీలెండి, పీడాపోయింది. యికనుండి యీ కాగితాల దండగే వుండదు; ఎర్ర ఏగాణి ముట్టాలా? పత్రిక రావాలా? ఏదీలేదు!"

"అంతలోకే అంత నిరుత్సాహమా? ఓపిక వహించాలి! ప్రయత్నం మీఁద ప్రయత్నం చేయాలి; యింకా చాలకపోతే బ్రూసు - సాలీడుమల్లే ప్రయత్నం చేసి ఫలితం పొందాలి!"

"మొదటి ప్రయత్నానికి విఘ్నం కలుగుతే నిరుత్సాహం తప్ప, ఉత్సాహ ముండదండి"... యింతలో ఎవరో వీధిలోనుంచి నన్ను పిల్వడం చేత మాయావిడ క్రిందకు వెళ్లి, తపాలా బంట్రోతు యిచ్చిన కవరుత్తరమును పుచ్చుకుని, నవ్వుకుంటూ, నాదగ్గరకొచ్చింది. చేతికందిస్తూ.

"పైవిలాసమును బట్టి చూడ, ఎవరో రాత సరిగా తెలియని స్త్రీ రాసినట్లుంది!" అంది. ఆదస్తూరి చూడగానే నామనస్సూ అనుమాన పడసాగింది. కవరు చింపి లోపటి వుత్తరాన్ని మాటుగాఁదెరచి, చూశాను. పరిచయసుని రాతలాలేదు; చివర్నివున్న సంతకాన్ని పరిశీలించగా వుబ్బి తబ్బిబ్బులైపోయాను; సర్వలోకాధిపత్యం యిచ్చినట్లు సంతోషించాను. వెంటనే వుత్తరాన్ని కవరు సంచిలోవుంచి, యథాప్రకారము పత్రికాపఠనము చేస్తున్నాను.

"ఎవరి దగ్గరి నుంచండి వుత్తరం" అని మాయావిడ ప్రశ్నించింది.

"ఎవరో స్నేహితుఁడు వ్రాశాడు!" అని నగ్న సత్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నములో తొందర పడలేదు.

"స్నేహితుడా?" చిన్నగా నవ్వింది... పత్రిక చదుతున్నానేగాని, ధ్యాసంతా ఆవుత్తరం మీఁదే వుంది. హృదయ మెందుకో రెప రెప కొట్టుకుంటున్నాది. ఏవో అవ్యక్త వూహాలు జనిస్తున్నాయి; నశిస్తున్నాయి! వుత్తరాన్ని చదువుదామనే తొందర, మాయావిడ ప్రక్కనుండటంచేత చల్లారిపోయింది.

ఇంతలో మాయావిడ లేచి, వొళ్లు విరుస్తూ, "టైం అయింది. కాఫీ కాచటానికి!" అంటూ,

క్రిందను పోయింది. భగవంతుడికి పది వేల నమస్కారము లర్పించా మనస్సులో. వెంటనే వుత్తరాన్ని తీసి చదవ నారంభించాను.

మదీయ మనోమానస తస్కరా, ప్రణయ మనోజ్ఞమూర్తి! వందనములు.

మీదర్శన భాగ్యమును అను నిత్యము నాకు కలిగిస్తున్న, ఆపరమేశ్వరునికి వందన శతము లర్పించుచున్నాను. సదా మీకనుసన్నలలో మెలగుతూ నామనోభిప్రాయమును నా చూపులుద్వారా, చేతలు ద్వారా తెలియఁబరచుచున్నప్పటికీ మీరు నిశ్శబ్దముగా వూరుకోనటం నాకోర్కెలను న్యూనత పరచినవారౌతున్నారు.

మనోహరమూర్తి!

ఏపనిజేసినా మీసుందర దివ్యవిగ్రహమే కనఁబడేది. అన్నం సహించకుండా వుంది, కంటికి నిదుర పట్టుటలేదు; గాఢ నిద్దర్లో మధుర స్వప్నములలో పూర్ణస్పృహలో; మీదివ్యసుందరవిగ్రహమే ప్రత్యక్షమౌతూ పిచ్చిదానిగా చేస్తున్నాది.

ప్రభూ!

నామదిలోని కోర్కెలు మీమీద నిలిచాయి; మీరుకాదంటే నాజీవితం పరిదగ్ధం! నాయీకోర్కెలను వీలయినంత విపులముగా వ్రాశాను.

ఘనమయిన న్యాయమూర్తీ!

నాయవస్థ నర్థము చేసుకుని, సరియైన న్యాయమును ప్రసాదిస్తారని, యీ అభాగ్యురాలు ఆశిస్తున్నాది. నిత్యమూ అంతరాత్మ యొక్క ప్రార్థనా మందిరములో కోర్కెలు జేగంటలై మ్రోగుతూన్నాయి మ్రోగేశబ్దమునకు మోసం చేయకండి! నాకోర్కెలను వితఁజేయవలదని నాప్రార్థన! 'స్త్రీ తనకు తానై వలచి నపుడు, పురుషుడు చులకనచేస్తా' డన్న విషయాన్ని సార్థపరచకండి! నేను అబలను; నాకున్న కొద్దిపాటి జ్ఞానముతో వ్రాసిన యీయుత్తరములో అనేక పొరపాట్లు వుండవచ్చు; వాట్ని మన్నించాలి.

మరొక విషయం ప్రభూ!!

మీకొక యర్ధాంగి యుందన్న సంగతి తెల్సినప్పటికీ, మీమీద గాఢమయిన ప్రేమ, కోర్కెలు కలగటంచేత, నన్నీసాహస కార్యములోనికి దింపాయి. పరిస్థితులు తరుమారయినా, ఎవరైనాసరే ధిక్కరించి మీకౌగిట్లో సుఖించాలని మదీయ అభిలాష!

ప్రణయమూర్తి!

నన్నెప్పుడు, ఎక్కడ కల్సుకునేది యీదీసురాలు యీవుత్తరంలో వ్రాసుకుంది; గ్రహించ ప్రార్థన; మోసం చేయవలదని ప్రార్థిస్తు, ముగిస్తున్నాను. సెలవ్.

చిత్తగించ వలెను.

ఇట్లు
మీ చరణదాసి
చిట్టి

అని చదివి ముగించాను. అనుకోకుండా యిటువంటవకాశమును కలిగించినందుకు తిరుపతి దేవుడికి మొక్కు చెల్లించవల్సిందే!

చిట్టి లేఖారచనలోని మధురత్వం వైదగ్ధ్యం, నన్ను విస్మయుణ్ణిగా చేశాయి. నిజంగా చిట్టే యీ వుత్తరం వ్రాసిందా? యింత దగ్గర్లో ఆమె స్నేహం లభ్యమౌతూ, నాకోర్కె తీరే యవకాశము లభిస్తుందనుకోలా! చిట్టి నిర్ణయించిన రోజున ఆమెను కల్సుకునేందుకు నిశ్చయించాను.

అదేసమయంలో నాహృదిలో వొక ధర్మసందేహము నను తొలివ్వక దప్పిందికాదు; వెధవది 'కాశ్మీరు సమస్య'లా బాధపెడుతూంది; చిట్టితో స్నేహం చేయటం, అన్నెము, పున్నె మెరుఁగని నా శ్రీకాంతకు ద్రోహం చేసిన వాడినౌతానేమో అని!

"పిచ్చివాడా! చిట్టి కోర్కెలనుఁ దీర్చినంత మాత్రాన, మీయావిడి కప్పుడే ద్రోహం తలపెట్టినట్లే? నిన్నే 'కొండగానో, సుయ్యగానో' భావిస్తున్న

చిట్టి కోర్కెలను విఠంజేస్తావా? కనుక మనస్సులో పిచ్చి అనుమానములకు తావివ్వక, చిట్టి చెప్పినట్లు ప్రవర్తించటం నాకు సమ్మత” మంటూ, నా అంతరాత్మ వేయి నాలుకలతో ఘోషించి చెప్పింది ... తుదకు చిట్టికోర్కె ప్రకారము ప్రవర్తించేందుకు నిశ్చయించాను.

## 2

ఆనాడు చిట్టిని కల్సుకునే ఆనందకరమయిన దినం! (Red letter Day) ఆతొలినాంటి రాత్రి, ఆమరునాండు చిట్టి నేవిధంగా కల్సుకోవటం? ఎలాసంభాషించాలో? మున్నుగు మధురాలోచనలతో ఆరాత్రాంతా తీయగా గడిపాను; యీ అమర సంతోషంలో రాత్రి నిదుర పోక పోవటంచేత, సహజంగా మానవునికి కలిగే బాధ ననుభవించుట లేదు ... వేకువనేలేచి ఆదరా బాదరాగా కాల కృత్యములు ముగించుకుని నాయలవాటు ప్రకారము నాగదిని చేరుకున్నాను నాప్రియురాలి దర్శనం కోసమై!

అలా ఎంత సేపు వేచియున్నానో ఆ ‘పులహ లాండ పెరుమాళు’ కెరుక! కానీ ఎంతవేచినా ఆచంద్రబింబపు మోము దర్శనమేలేదు. నిజముగా నిరుత్సాహమే జనించింది! ఏవో తొందర పనులుండటం చేత రాలేదనుకుని, హృదయాన్ని పదిల పర్చుకున్నాను.

యింతలో క్రింది నుంచి

“కాఫీ చల్లారి పోతూంది, రండి!” అంటూ మా శ్రీకాంత పిల్చింది. ఆనాడు ఏనాడూ వుండనంత వుత్సాహంగా వుంది. కాఫీకి తోడుగా నాకిష్టమయిన పలహారం చేసిపెట్టింది; అందుకు నేనాశ్చర్య పోయాను.

“ఏప్పుడూ లేంది, యివాళ పలహారం చేసి పెట్టేవేఁ విశేషం ఏమిటి కన్నదూ? యింతలోకే నీకివెఱ్ఱి యభిమానం కలిగిందేం?”

“వెఱ్ఱభిమానమూ? మీరంటే నాకెంత ప్రేమా, ఎంతదయా!” అంది నవ్వుతూ.

“ఏమండీ, యివాళ సినీమాకు వెళ్ళాలని వుంది; ఏమంటారండి?” అని నిన్నటి విషయాన్ని మరల, కదిపింది.

“నాకేం చెముడులేదు; నిన్ననే నీకు సమాధానం చెప్పానుగా!” అన్నా.

“సరేలెండి!” అంది ...

## 3

మాశ్రీకాంత రెండవయాట కెళ్లింది. నాకు స్వేచ్ఛకూడా కలిగింది. చిట్టి నిర్ణయించిన కాలం సమీపించటం చేత, చూడ చక్కగా టాయిలెట్ చేసుకుని, చలువ జేసిన బట్టలను ధరించి యింటికి తాళం వేసి బయలుదేరా! చీకటి గాఢాంధకారంగావుంది; దారి నిర్దిష్టముగా కనబడక పోయినప్పటికీ, వెఱ్ఱి సంతోషంతో నడక సాగిస్తున్నాను.

చిట్టి నిర్దేశించిన స్థలములో ఏవరో వ్యక్తి నిల్చునట్లు మసక మసకగా గోచరమయ్యారు ... ఆమె చిట్టని తెలియగానే ... ఉద్రేకం ... ఉత్సాహం ... ఉరికి పొంగుతూంది. ఆమె సమీపమునకు వెళ్లి,

“చిట్టీ!” అని మెల్లగా పిలిచాను ... దూరాన వున్న శ్రీరామాషుగరు మిల్లు హోరు తప్ప, మిగతా ప్రపంచమంతా నిశ్శబ్దముగావే వుంది.

“ఉష్ ... మెల్లగా ... మీదర్శన భాగ్యమున కెదురు జూస్తూన్న, మీచరణదాసి చిట్టే! ... యిల్లా యింట్లోకి రండి; మనసార మాట్లాడుకుందా” మంటూ దారి తీసింది.

“ఉత్తరం వ్రాశావేగాని వస్తావో, రావో అని నేనెంత భయపడ్డా ననుకున్నావ్? ... అబ్బ ...” అంటూ ఓదీర్ఘ నిశ్వాస విడచాను.

“ఉత్తరం వ్రాశానేగాని ... మీరు వస్తారో రారో “అని నేనెంత భయపడ్డాను!” మీరు మాట తోసేయకుండా వచ్చినందుకు నాకృతజ్ఞత!” అంది ... “మీరు నాకు కనబడని రోజున నేనెంత పిచ్చిదానిగా మారిపోయానో ఆభగవంతుడికి తెలియాలి!” అంటూ దగ్గరికి వొచ్చింది.

ఇలా రెండుగంటల కాలము గడిచినది.

"చిట్టీ; యింక మనం యింటికి పోదాం పద" అంటూ, లేచా! నడుస్తూ.

"నాదోమనవి -" అంది.

"ఏమిటది?" అక్కజంగా అడిగారు. "ఎన్నాళ్లు మనకీ దొంగ బ్రతుకు చెప్పండి? మీమీద ప్రేమ నన్ను పిచ్చిదానిగా చేసింది; మిమ్మల్ని దప్ప అన్యుల్ని యీహృదయం కోరటం లేదు; మీ భార్య



మీకు తగింకాదు; ఎటువంటి సంకోచం పెట్టుకోకుండా నామనవి ప్రకారం ఎక్కడకయినా పోయి, సుఖమయన జీవితం గడుపుదాం; తరగని బంగారం నాదగ్గరుంది లెండి!" అని ఆవేశంగా మాట్లాడింది.

"నీవింత తొందర పడకూడదు చిట్టీ; ఏదయినా పూర్వాపరము లాలోచించి పనిచేయ్యాలి ... నాకు కాలవ్యవధియ్యి; ఆలోచించి చెపుతా. ఏదెట్లున్నా నన్నే సర్వం నమ్ముకున్న మా శ్రీకాంత గతి?"

"ఆత్మీయుల్ని; బంధువులనుగూడా ధిక్కరించి మీరే అని నమ్ముకుని. పరివ్రాజికమల్లే సర్వసంగపరిత్యాగము చేసి; యీవలబడ్డ యీచిట్టిమాటో?" అంది. గొంతుకలో వెలక్కాయ పడ్డట్టయింది! మౌనంగా నడుస్తున్నాము ... మాయింటి తలుపు తెరిచాను. నా వెంబడే చిట్టిగూడా వచ్చింది. మా యావిడ సినీమానుండి వచ్చేవేళవటం చేత, గాబరా పడసాగాను దీపాన్ని వెలిగించే ప్రయత్నంలో అగ్గిపెట్టెను వెతుక్కుతూ.

"చిట్టీ నువ్వు చెప్పిన విషయమై ఆలోచించి చెపుతా యివాల్టికి యింటికిపో!" అని బ్రతిమాలా

"ఏమయినాసరే; మిమ్మల్ని నమ్ముకున్న తరువాత; యిక కదల దల్చుకోలేదు." అంది ... యీమె మాటలధోరణి మాయావిడ వచ్చేవేళ; నన్ను భయవిహ్వాలునిగా చేస్తున్నాయి. దీపం వెలిగించి; చిట్టిని మాయమాటలతో సాగనంపుదామనుకుని వెనక్కు దిరిగాను.

ఇంకేముంది? గుండెలు గతుక్కు మన్నాయి; నిలువునా నీరైపోయాను. శిఖండి హృదయంతో నిలబడిపోయాను. 'ఆమె' మా ఆవిడే అని తెల్సుకున్న తరువాత; మా శ్రీకాంత ముఖంలోకి చూడలేకపోయాను! మాయావిడింత నాటకమాడి; పరస్త్రీవ్యామోహం మానవలసిందిగా చెప్పిన గుణపాఠం హృద్గతం; యిప్పటికీ హృదయాంతరాళములో సుళ్లు తిరుగుతూనేయుంది.

"క్షమించు!" అనలేక అన్నాను.